క్లుప్తంగా

30న దుర్యోధన వధ

చంద్రగిరి: స్థానిక పాతపేటలోని శ్రీద్రౌపది సమేత శ్రీధర్మరాజులు స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా కీలకమైన దుర్యోధన వధ ఘట్టాన్ని ఆదివారం నిర్వహించాల్సి ఉంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఆలయ పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం దుర్యోధన వధ ఘట్టం, గురువారం స్వామి, అమ్మవార్ల ఊరేగింపుతో మహాభారత ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

పక్కాగా ఓటరు వెరిఫికేషన్



ఓటరు వెరిఫికేషన్ చేస్తున్న ఆర్డీఓ కనక నరసారెడ్డి

చంద్రగిరి: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లకు తావివ్వకుండా ఓటరు వెరిఫికేషన్‌ను పక్కాగా చేపట్టాలని తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి ఆదేశించారు. ఆయన ఆదివారం కొత్త శానంబట్ల, పాత శానంబట్ల, తొండవాడ గ్రామాల్లో ఓటరు సర్వేను పరిశీలించారు. స్వయంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ తొలగించిన ఓటర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి సమాచారం మేరకు వెరిఫికేషన్ పక్కాగా చేపడుతున్నట్లు ఆయన నిర్ధారించుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది ఓటర్లు మరణించినప్పటికీ వారి మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించకపోవడంతో కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. కార్యక్రమంలో డీటీ మోహన్ రెడ్డి, వీఆర్‌ఓ మునస్వామి, వీఆర్‌ఏ మధు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నాటక ప్రధాన కార్యదర్శి వందిత శర్మ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఏ సర్వీసు బస్సు వచ్చినా ఎక్కడానికి ప్రయాణికులు క్యూకట్టారు. ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఆర్డినరీ సర్వీసులు కూడా రద్దీగా నడిచాయి. ప్రయాణికులను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు కనిపించలేదు. ప్రయాణికులు సీట్ల కోసం తోపులాటకు దిగారు. దొంగలు హల్‌చల్ చేశారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లోపంతో బస్టాండ్లు గందరగోళంగా మారుతున్నాయి. దీనిపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడును వివరణ కోరగా పరిశీలించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ల బైండోవర్



స్టేషన్‌లో వున్న అసోసియేషన్ నాయకులు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీలో నాలుగు రోజులుగా 110 జీవోను అమలు చేయాలని నిరసన తెలుపుతున్న అకడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ నాయకులను ఆదివారం ఎస్వీయూ పోలీసులు బైండోవర్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నగరికి విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే అసోసియేషన్ నాయకులను బైండోవర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసోసియేషన్ నాయకులు ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు తెలిసింది. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు వారిని పరామర్శించారు. ఆదివారం రాత్రికి వారిని విడుదల చేయనున్నట్లు సమాచారం.

ఎలమండ్యంలో ఘనంగా మారెమ్మ జాతర



విశేషాలంకరణలో అమ్మవారు.

రేణిగుంట: మండల పరిధిలోని ఎలమండ్యం దళితవాడలో ఆదివారం మారెమ్మ జాతరను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారికి గెరిగ ఊరేగింపు అత్యంత ఘనంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో పూజలందుకున్న అనంతరం గెరిగ సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పెద్దఎత్తున మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ వేషాల్లో వీధుల్లో సందడి చేశారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు ఎం.పెద్ద సిద్దయ్య, పి.సుబ్రమణ్యం, నాగరాజు, శంకరయ్య, గోపీ, ప్రసాద్, తిరుపాల్, జగయ్య, శేషాద్రి, నారాయణ, భువన, భూపతి, పద్మ, చంద్ర, చాముండేశ్వరి పాల్గొన్నారు.

ఆధునిక సౌకర్యాలతో | మోడ్రన్ పింక్ టాయిలెట్లు

- మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మున్సిపల్ కార్పొరేషన్
- చంటి బిడ్డల ఫీడింగ్‌కు ప్రత్యేక గదులు
- హై క్లాస్‌తో రెస్ట్ రూముల ఏర్పాటు





మోడ్రన్ పింక్ టాయిలెట్ సముదాయం, చంటి బిడ్డల ఫీడింగ్ కోసం ఏర్పాటుచేసిన సోఫా

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మహిళల కోసం పలు కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం సమీపంలోని ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కూడలి సమీపంలో మోడ్రన్ పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్ నిబంధనల ప్రకారం మహిళలు, చంటి బిడ్డల తల్లులు, చంటి బిడ్డలకు సౌకర్యవంతంగా ఉండేందుకు రద్దీ ప్రాంతాల్లో వీటిని నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ పింక్ టాయిలెట్ సముదాయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

రూ.13 లక్షలతో నిర్మాణం

మోడ్రన్ పింక్ టాయిలెట్లను రూ.13 లక్షలతో ఆధునికంగా, సౌకర్యవంతంగా నిర్మించారు. ఇందులో ఇండియన్, యూరోపియన్ టాయిలెట్లు ఉన్నాయి. అలానే బాత్ రూమ్, యూరినల్స్, వాష్ రూములు కూడా ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు. వీటికి మంచి స్పందన రావడంతో వీటిని ఇతర నగరాల్లోనూ నిర్మించేందుకు అక్కడి అధికారులు పరిశీలించి వెళ్లారు. రైల్వే స్టేషన్, అలిపిరి, కపిలతీర్థం, గోవిందరాజస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి మోడ్రన్ పింక్ టాయిలెట్లను నిర్మించాలని మున్సిపల్ కార్పొరేషన్ భావిస్తోంది.



ఆధునిక టాయిలెట్

మహిళల కోసం ప్రత్యేకంగా

మోడ్రన్ పింక్ టాయిలెట్లను మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించారు. తిరుపతి యాత్రా స్థలం కావడంతో వేలాది మంది యాత్రికులు ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తుంటారు. చంటి బిడ్డలకు పాలు పట్టించేందుకు, పసిబిడ్డలకు విశ్రాంతి కల్పించేందుకు ఇప్పటి వరకు ప్రత్యేకంగా ఎలాంటి సౌకర్యాలు లేవు. ఆ సమస్యను అధిగమించేందుకు పింక్ టాయిలెట్లను నిర్మించారు. తల్లులు చంటి బిడ్డలకు పాలు పట్టించేందుకు ప్రత్యేక గదిలో సౌకర్యంతమైన సోఫాను అందుబాటులో ఉంచారు. పసిబిడ్డల విశ్రాంతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలానే డైపర్స్ మార్చుకునేందుకు మరో స్పెషల్ రూమ్‌ను సిద్ధంగా ఉంచారు.

ప్రారంభానికి సిద్ధం



మహిళలు, చంటిబిడ్డ తల్లులకు పింక్ టాయిలెట్ల అవసరాన్ని గుర్తించాం. స్వచ్ఛ భారత్ నిబంధనలకు అనుగుణంగా వీటిని ఆధునికంగా నిర్మించాం. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మించిన మోడ్రన్ పింక్ టాయిలెట్ పనులు పూర్తయ్యాయి. త్వరలో అందుబాటులోకి తెస్తాం.

–డి.హరిత, కమిషనర్, నగరపాలక సంస్థ, తిరుపతి

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శ



ఉష భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సీఎం కేశవులు(బుజ్జి) సతీమణి, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యురాలు ఉష(39) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొత్తపేట బజారువీధిలో సీఎం కేశవులు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఉష భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం కేశవులు, ఆయన కుమారులను ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గంగమ్మ ఆలయంపై ఆరోపణలు తగదు

- యధావిధిగా ఆలయ నిర్మాణం, ఉత్సవాల నిర్వహణ
- ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణంపై ఓ పత్రికలో వచ్చిన కథనం అపోహ మాత్రమేనని, అందులో వాస్తవం లేదని ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ స్పష్టం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత అమ్మవారి ఆలయ స్థాయిలో యధావిధిగా ఆలయ నిర్మాణం సాగుతోందని, ఆలయ కార్యక్రమాలకు, ఉత్సవాలు నిర్వహణ కొనసాగుతోందన్నారు. గంగమ్మ తల్లి కొత్త ఆలయ చుట్టూ ఇకపై పొర్లు దండాలు కనపడవా?, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు ఉండదా? అంటూ తప్పుడు కథనం ప్రచురించి భక్తుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదన్నారు. పాత ఆలయం ఏ హద్దుల్లో ఉందో అదే హద్దుల ప్రకారం పునర్నిర్మాణం జరుగుతోందన్నారు. ఉన్న స్థలాన్ని తగ్గించడం, పెంచడం వంటివి ఉండవని స్పష్టం చేశారు. అప్పటి నిర్మాణం 3 అడుగుల ఎత్తు దానిపై గ్రిల్స్ ఉండేదని, గ్రిల్స్‌కు ఇరువైపులా పిల్లర్లపై ఆలయ నిర్మాణం చేశారని తెలిపారు. ఇప్పటి ఆలయ నిర్మాణం రాయితో నిర్మిస్తున్నట్టు వివరించారు. నిర్మాణం పూర్తయితే వాస్తవం ఏమిటనేది తెలుస్తుందని, ఆలయంలో ఎలాంటి తప్పిదాలకు చోటు ఉండదని స్పష్టం చేశారు. ఇలాంటి అవాస్తవాల కథనాలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తాయన్నారు. ఇప్పటికైనా అపోహలు, అవాస్తవాల గురించి కథనాలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. ఆలయ ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ పాలక మండలి సభ్యులు ఎస్.భారతి, వి.క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

గురువులు దేశ భవిష్యత్ నిర్మాతలు



వర్క్‌షాపులో పాల్గొన్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: గురువులు దేశ నిర్మాతలని, వారిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంతో పాటు ప్రభుత్వంపైనా ఉందని ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, తెలుగు ప్రాంత సహాయ్ ప్రముఖ్ మారుతి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలులో ఆదివారం కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్ర తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో టీచర్స్ ఈజ్ నేషనల్ బిల్డర్స్ మిషన్ 2047 అనే అంశంపై అధ్యాపకులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047కు వందేళ్లు పూర్తవుతాయన్నారు. దేశ నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర చాలా ఉందన్నారు. వచ్చే 24 ఏళ్ల పాటు గురువులు విద్యార్థులకు విషయ బోధనతోపాటు క్రమశిక్షణ జీవితం, నైతిక బాధ్యత, సామాజిక విలువలు నేర్పాలన్నారు. వ్యవసాయం, వ్యాపారం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. మానవ బంధాలు, క్రీడా పరిజ్ఞానం, ఆరోగ్య, పర్యావరణపైనా వివరించాలని తెలిపారు. గురువులు బాధ్యతగా విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకు ఒక్కసారైనా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా సమాజంలో ప్రజలు, ప్రభుత్వం గురువులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గురువుల నుంచి తయారయ్యే అధికారులు, డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలకు సంఘం ఇచ్చే గౌరవం, ప్రభుత్వం కల్పించే ఆర్థిక సౌకర్యాలు గురువులకు లభించడం లేదని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాకనాటి హరిక్రిష్ణ, విజయభాస్కరరెడ్డి, అబాకస్ రామక్రిష్ణారెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఈశ్వరాంబ నృత్యశాల ఆధ్వర్యంలో నాట్య గురువు ప్రీతి మీనన్ పర్యవేక్షణలో కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులు అనాఘ, శ్రీయ, మీనన్, శ్రీయాస్, గౌరి, విజయ, వేదిక, ఆర్యన్ నంద, అన్విత ప్రియను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ : స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల విద్యార్థులు ఆదివారం విడుదలైన డిగ్రీ మూడో సంవత్సరం 6వ సెమిస్టర్ ఫలితాల్లో 369 మంది విద్యార్థులు డిస్టెంక్షన్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎ.ఉషా తెలిపారు. బీకాంలో సుప్రజ, హారిక 9.25 పాయింట్లు, బీబీఏలో తేజశ్రీ 9.23, బీసీఏలో అనుప్రియ 8.96, హేస్విత 8.43 పాయింట్లు సాధించి టాపర్లుగా నిలిచారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డీపీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

అమ్మవారి సేవలో మాజీ సీజేఐ



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా జేఈఓ తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్ పాల్గొన్నారు.

మాజీ సీజేఐని కలిసిన న్యాయవాదులు

తిరుపతి లీగల్: శ్రీవారి దర్శనార్థం వచ్చిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ.రమణను ఆదివారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో తిరుపతికి చెందిన న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ అధ్యక్షుడు దినకర్, న్యాయవాదులు వెంకటరమణ, నిరంజన్ నాయుడు, వెంకటరత్నం పాల్గొన్నారు.

సెప్టెంబరు 7న గోకులాష్టమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7న గోకులాష్టమిని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన చేస్తామని, ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ చేస్తామని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 8న ఉట్లోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్‌సేవ ఉంటాయని వెల్లడించారు. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 7.30 గంటల వరకు స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కారణంగా సెప్టెంబరు 8న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను రద్దు చేస్తున్నట్టు వివరించారు.



పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక


తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో 1975–76లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి అల్లరి, తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొరస్వామిరెడ్డి, దుర్గావరప్రసాద్, వనం గౌరీ శంకర్, ఉదయభాను, ఆ పాఠశాల హెచ్‌ఎం ఆనంద కుమార్, రిటైర్డ్ టీచర్లు మునిరామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.


యానాదయ్యకు సత్కారం



సిద్ధవటం యానాదయ్యను సత్కరిస్తున్న టీటీడీ ఉద్యోగ, కల్యాణ కట్ట సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సిద్ధవటం యానాదయ్యను టీటీడీ కల్యాణకట్ట సంఘం నేతలు ఆదివారం విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి అభినందించారు. టీటీడీ ఉద్యోగుల సంఘం నేతలు వి.పవన్, కె.శివ, టీటీడీ కల్యాణ కట్ట సంఘం అధ్యక్షుడు కె.వెంకటసుబ్బయ్య,, తిరుపతి నాయీ బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు కె.మహేష్ పాల్గొన్నారు.





అబ్బురం అంబర వర్ణం

హస్తాద్రిపై భానుడు అస్తమించేవేళ అంబర వీధిన మేఘాలు బంగారు, నీలి వర్ణంతో మెరుస్తూ కనువిందు చేశాయి. ఈ దృశ్యం పుత్తూరు మండలం తడుకు వద్ద కనిపించింది. స్థానికులు వాటిని చూసి మురిసిపోయారు. సెల్ ఫోన్లలో బంధించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీలో ఎన్‌సీటీఈ నిబంధనలను పాటించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్(ఫోర్టో) ఉమ్మడి జిల్లా చైర్మన్ దొడ్డా ఉమామహేశ్వర్ తెలిపారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం వర్చువల్‌గా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేఎల్ పోస్టుల భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ నిబంధనల మేరకు పీజీతో పాటు బీఈడీ ఉన్న వారే జూనియర్ లెక్చరర్ల పోస్టులకు అర్హులని తెలిపారు. 70 శాతం ఫీడర్ కేటగిరి వారికి పదోన్నతుల ద్వారా, 30 శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు చేపట్టాలని కోరారు. ప్లస్ టూ పాఠశాలల్లో 11, 12వ తరగతులకు బోధించే టీచర్లకు జూనియర్ లెక్చరర్లతో సమానంగా వేతనాన్ని ఇస్తూ గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. అలాగే జీఓ 117, 128ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోర్టో ప్రధాన కార్యదర్శి పి.మునిరత్నం, నాయకులు వి.మురళీమోహన్‌రెడ్డి, కె.రామమూర్తి, కె.వాసుదేవయ్య, కె.రవి, సి.ఈశ్వరయ్య, సి.భారతి, పి.రమేష్, కె.ఆంజనేయులు, ఎం.సిరాజ్ అహ్మద్, వి.సురేష్, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసమే ఉమ్మడి పౌరస్మృతి

- ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాకా సుధాకర్

తిరుపతి సిటీ: దేశ సమగ్రత, సమైక్యత కోసం ఉమ్మడి పౌరస్మృతి (అందరికీ ఒకే విధమైన చట్టం) అమలులో ఉండాలని ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్ అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పౌరస్మృతి అనే అంశంపై ఆదివారం తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో సమలోచన సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఈ దేశంలో రావలసిన ఉమ్మడి పౌరస్మృతి చట్టం 76 ఏళ్ల తర్వాత వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం ఒక మతానికో.. ఒక వర్గానికో పరిమితమైంది కాదన్నారు. ఒకే దేశం–ఒకే ప్రజ–ఒకే చట్టం అనే రీతిలో ఈ దేశ భవిష్యత్తు, సమైక్యత కోసం అవసరమన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకతాటి పైకి రావాలన్నారు. ప్రముఖ న్యాయవాది ఎం నాగరాజు మాట్లాడుతూ, ఒకే దేశం–ఒకే చట్టం ఉండాలని, వేర్వేరు వర్గాలకు అనేక రకాలుగా చట్టాలు ఉండటం సమంజసం కాదన్నారు. సదస్సులో సమాలోచన సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, జిల్లా కన్వీనర్ డాక్టర్ మార్గాని సోమశేఖర, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ దత్తాత్రేయ, దొమ్మరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: స్వహస్త ఆర్గనైజేషన్ సభ్యులు ప్రతి నెలా చేపట్టే ఫుడ్ టూ నీడీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతి నగరంలోని రుయా, అలిపిరి, బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై ఉన్న అనాథలకు అన్నం పెట్టారు. వారు తమ పాకెట్ మనీతో సొంతంగా తయారు చేసిన అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేస్తున్న విషయం తెలిసిందే. సుకుమార్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, చైతన్య, చరణ్, లోకేష్, సూర్య పాల్గొన్నారు.

చిత్రార్చన పుస్తకావిష్కరణ



చిత్రార్చన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: కవిత్వం, సాహిత్యం వంటిదే చిత్రకళ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతికి చెందిన గృహిణి బత్తుల అర్చన నిర్మల్ పెయింటింగ్‌లో సాధన చేస్తున్న సందర్భంగా చిత్రించిన పెయింటింగ్స్‌తో కూడిన పుస్తకం చిత్రార్చనను ఆదివారం ఒక ప్రైవేటు హోటల్‌లో ఆవిష్కరించారు. ఎస్వీ శిల్ప శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి మాట్లాడుతూ అర్చన పెయింటింగ్స్ చక్కగా ఉన్నాయన్నారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని మేయర్ డాక్టర్ శిరీషకు అందజేశారు. తుడా కార్యదర్శి లక్ష్మీ, సీనియర్ పాత్రికేయుడు, రచయిత ఉమామహేశ్వరరావు చిత్రకారిణిని అభినందించారు. కార్యక్రమంలో శివప్రసాద్, డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్, రాయలసీమ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నవీన్‌కుమార్ రెడ్డి, అరసం అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, తిరుపతి ఆర్ట్ సొసైటీ బాలసుబ్రమణ్యం, డాక్టర్ వి.కాంతారావు పాల్గొన్నారు.